# మార్పు

టి.యస్.కళాధర్



అనగనగా ఒక ఉద్యానవనం.

అందులో రకరకాలైన పూలున్నాయి. రంగురంగుల గులాబీలు, చేమంతులూ కాక మల్లెపూలూ, సన్నజాజులూ, కనకాంబరాలూ ఒకటేమికటి, చెప్పడానికి వీల్లేనన్ని రకాలు.

గాలి వీచినప్పుడల్లా తమ తమ సహజసిద్ధ సువాసనలతో తోటలోకి వచ్చిన వారిని ఆనందింపజేస్తున్నాయి.

ఆ సువాసనలను ఆఘ్రాణించిన వాళ్ళు కొందరు ఆయా పుష్పాల దగ్గరగా వెళ్ళి నచ్చిన వాటిని కోసుకుంటున్నారు. కొందరు స్త్రీలు సిగలో అలంకరించుకుంటున్నారు.

కొందరు 'ఇది గులాబీ.. నాకు చాలా ఇష్టం' అనీ మరికొందరు 'మల్లెలు... అమ్మబాబోయ్ నాకు మరీ ఇష్టమని' ఇలా ఎవరికి నచ్చిన పుష్పాన్ని వారు ఎన్నుకోవడం జరుగుతూంది.

అదే తోటలో...

అక్కడే కొంతదూరంలో నేలపై విరిసిన గడ్డిపూలు.

అయినా ఎవరూ వాటివంక చూడడంలేదు. కొన్ని పాదచారుల కాళ్లక్రింద

నలిగిపోతున్నాయి. వాటికీ బాధ భరించలేనిదిగా వుంది.

మిగతా పూలపట్ల చూపిస్తున్న ఆదరాభిమానాలు జనాలు తమపట్ల ఎందుచు చూపడం లేద న్నదే వాటికర్థం కావడంలేదు. అవీ పూలే... తామూ పూలే. అయితే వాటికీ తమకూ ఉన్న తేడా ఏమిటన్నదే వాటికర్థంకాని సమస్య.

గడ్డిపూలు గుమిగూడాయి. మంతనాలు చేశాయి. సభ ఏర్పాటు చేసుకున్నాయి. పాదాల కింద నలిగిన పూలకు సంతాపాన్ని ప్రకటిస్తూ బ్రహ్మదేవుని గూర్చి తపస్సు చేయాలని నిర్ణయించుకున్నాయి.

ఓ మంచి ముహూర్తంలో బ్రహ్మకోసం తపస్సు మొదలెట్టాయి. తపస్సు ఘోరంగా సాగింది. వాటి తపస్సుకు బ్రహ్మ మెచ్చి దిగివచ్చాడు.

ఆయన ప్రత్యక్షం కావడంతో గడ్డిపూల ఆనందం వర్ణనాతీతం. బ్రహ్మ 'మీ బాధేమిటి?' అని అడిగాడు.

అన్నీ ఒకసారిగా భోరుమన్నాయి. ''స్వామీ... మా బ్రతుకు దుర్భరంగా వుంది. నరమానవుడె వడూ మమ్మల్ని లెక్కచేయడం లేదు. ముళ్ల గుచ్చుకున్నా గులాబీనే కోరుకుంటున్నారు. పందిరి అందకున్నా మల్లెలే కోసుకుంటున్నారెగిరెగిరి. అందుబాటులో వున్నా మేము వారి కళ్లకు కనపడమా? మమ్మల్ని మాత్రం చిన్నచూపు చూడడమేమిటి స్వామీ?''

''అంతేనా...?''

''అంతేనా ఏమిటి స్వామీ. మిగతా పూలలాగా మాకు రంగూ వాసనా ఇవ్వని నువ్వు కనీసం మంచిపేరు కూడా లేకుండా చేశావు. దీనికి నీ సంజాయిషీ కావాలి.''

''సంజాయిషీ అంటే ప్రపంచంలో అన్నీ అందరికీ ఇవ్వలేకపోయాను. ఇది వాస్తవం. కొందరు చేసిన పుణ్యానుసారమో, కర్మానుసారమో రకరకాల రూపురేఖలు ఇచ్చినా దానికి తగిన గుణగణాలు ఇవ్వలేక, కొందరికి గుణగణాలు ఇస్తూ అందచందాలివ్వలేకపోయాను. కొందరికి అందచందాలిస్తూ కూడా లేని పోని కష్టాలు రాసిపెట్టాను. ఇన్నాళ్లకు మీరొచ్చారు. మీ బాధ చెప్పుకున్నారు. విన్నాను. ఎక్కడో పొరపాటు చేశానేమో! ఎందుకు చేశానో కూడా ఆలోచించే సమయం లేదు. ఇవన్నీ వదిలేసి మీకేం కావాలో అడగండి''.

ఓ గడ్డిపూవు లేచింది.

బాగా ఆలోచిస్తున్నట్లు 'ఈ మానవులు నేటినుంచి నన్ను గులాబీ అనేలా ఆశీర్వదించండి స్వామీ' అంది.

''గులాబీని మల్లెపూవని పిలిచినా, చేమంతిని గులాబీ అన్నా గడ్డి పూవన్నా వచ్చే నష్టమేమీ లేదు. వాటి వాటి సహజ సుగంధ లక్షణాలే వాటి ప్రాణం. వాటిని గుర్తుపట్టే ఆధారం. అంతేకానీ పేరు మార్పుతో జీవితాలు, జీవన గతి మారవు. ఐనా గుర్తింపు ఒకటే ప్రతిభకు కొలబద్ద కాదు, ఆ సంగతి తెలుసుకోండి''

ఇంకో గడ్డిపూవు లేచింది. 'నన్ను మల్లెమొగ్గ అనేలా ఆశర్వదించండి స్వామీ' అంది. ఇలా ఒకో గడ్డిపూవూ ఒకో కోరిక కోరుతూ మొత్తానికి సరికొత్త నామధేయాలతో పిలిపించుకునేలా వరాలు పొందాయి.

బ్రహ్మ అందరినీ కలయజూస్తూ ''తథాస్తు. నేటి నుంచి నరులెవ్వరూ మిమ్మల్ని మీరు కోరిన పేర్లతో పిలిచేలా వరమిస్తున్నాను'' అంటూ మాయమయ్యాడు.

గడ్డిపూలు గుడ్డి గర్వంతో తలెత్తి చూశాయి.

ఆరోజు నుంచి... అందరూ వాటి వాటి కోరికల ప్రకారం గులాబీ అని, చేమంతి అనీ, మల్లెపూలు అని పిలుస్తున్నారు. బ్రహ్మదేవుని కరుణతో కొత్త పిలుపులు పిలిపించుకుంటున్న పూలు రొమ్ము విరుచుకుని నిలబడ్డాయి.

కానీ... అందరూ వాటిని అలా విభిన్న రకాలుగా పిలవడమే కానీ యథాప్రకారం సువాసనా భరితమైన పాత పుష్పాలనే కోస్తున్నారు. ముళ్లు గుచ్చుకుంటున్నా, అందనంత ఎత్తులో వున్నా కష్టపడి ఆ పుష్పాల వంకే మొగ్గు చూపుతున్నారు.

ఒకరోజు... రెండోరోజు... మూడు రోజులు ఇలా రోజులు గడుస్తున్నా పరిస్థితి యథాప్రకారంగానే వుంది. పేర్ల మార్పు జరిగిందే తప్ప మానవుల ఆలోచనా విధానంలోగానీ, పూల బ్రతుకులోగానీ మార్పు లేకపోవడంతో పూల బాధ రెట్టింపు అయ్యింది.

మళ్ళీ అన్నీ సమావేశమయ్యాయి.

బ్రహ్మకోసం మళ్ళీ ఘోర తపస్సు సాగించాయి. మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు ఆయన. పూలన్నీ ఆయన ముందు తమ పరిస్థితి వివరించి భోరుమన్నాయి.

''గుణగణాలు ఇచ్చినా అందచందాలు అందించలేక కొన్ని తెలిసీ కొన్ని తెలియకా ఏదో పొరపాట్లు జరిగి వుండవచ్చు. ఇవి పొరపాట్లు కూడా కావు, గ్రహపాట్లు కూడా కావచ్చు. వాటికి తగ్గట్టో మరోవిధంగానో ఎవరో ఏదో పేరు పెట్టడం ఆ పేరుతో పిలవడం జరుగుతోంది. అంతేకానీ ఒకరి పేరుతో మరొకరిని పిలిచినా పిలిపించుకున్నా అంతమాత్రాన వారివారి సహజ గుణాలు, గుర్తింపులు మారవు, రంగులు రుచులు వాసనలు కూడా మారవు...''

పూలన్నీ వింటున్నాయా లేదా అని ఒక్కసారి పరికించి మళ్ళీ మొదలెట్టాడు బ్రహ్మ.

''గులాబీని మల్లెపూవని పిలిచినా, చేమంతిని గులాబీ అన్నా గడ్డి పూవన్నా వచ్చే నష్టమేమీ లేదు. వాటివాటి సహజ సుగంధ లక్షణాలే వాటి ప్రాణం. వాటిని గుర్తుపట్టే ఆధారం. అంతేకానీ పేరు మార్పుతో జీవితాలు, జీవన గతి మారవు. ఐనా గుర్తింపు ఒకటే ప్రతిభకు కొలబద్ద కాదు, ఆ సంగతి తెలుసుకోండి'' అంటూ అంతర్ధానమయ్యాడు బ్రహ్మ.

★

